RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 69 | పేజీలు : 4 | గురువారం 10 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



ఢిల్లీ బ్లాస్ట్ కేసులో కొత్త కోణం!

లాల్ మందిర్‌ను టార్గెట్ చేశారు.. ఎర్రకోట వద్ద పేల్చారు..

2025 ఢిల్లీ పేలుళ్లలో ఎర్రకోట ఉగ్రవాదుల అసలు లక్ష్యం కాదు

చాందినీ చౌక్‌లోని లాల్ మందిర్ వద్ద దాడికి తొలుత ప్లాన్

ట్రాఫిక్, భద్రత కారణంగా చివరి నిమిషంలో ప్రణాళిక మార్పు

సస్పెన్స్‌కు తెర.. భారత్‌కు జిన్‌పింగ్!

బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు రానున్నారు.

ఈ నెల 12, 13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రాకపై మాత్రం తొలి నుంచి సందిగ్ధతే నెలకొన్న సంగతి తెలిసిందే.

ఇంటర్నెట్ డెస్క్:

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్ పర్యటన విషయంలో కొనసాగుతోన్న సస్పెన్స్‌కు తెరపడింది. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు రానున్నారు. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వ రంగ మీడియా సంస్థ జిన్హువా వెల్లడించింది. దేశ రాజధాని దిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 12, 13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది ఈ సదస్సుకు మిగతా సభ్య దేశాల అగ్రనేతలు హాజరవుతుండగా.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రాకపై మాత్రం తొలి నుంచి సందిగ్ధతే నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే, తమకు కూడా ఎలాంటి అధికారిక సమాచారం లేదని అంతకుముందు చైనా విదేశాంగ శాఖ చెప్పడంతో.. అసలు జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సుకు వస్తారా? లేదా? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. చివరకు జిన్‌పింగ్ పర్యటనపై చైనా అధికారిక మీడియా నుంచి ప్రకటన వెలువడడం గమనార్హం. భారత్-చైనా మధ్య దశాబ్దాలుగా సరిహద్దు విభేదాలు నెలకొన్నాయి. 1962లో యుద్ధం వీటికి నాంది పలికిందని చెప్పొచ్చు. 2020లో గల్వాన్ ఘర్షణతో అవి మరింత తీవ్రరూపం దాల్చాయి. అయితే ఈ మధ్యకాలంలో రెండు దేశాలు కాస్త పట్టువిడుపులు ప్రదర్శిస్తున్నట్లు కనిపిస్తోంది. గతేడాది షాంఘై సహకార సదస్సు కు ప్రధాని మోదీ హాజరైన సంగతి తెలిసిందే. ఇక ఈ బ్రిక్స్ సదస్సుకు ముందు మోదీ, జిన్‌పింగ్ ప్రత్యేకంగా భేటీ అయి ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు సమాచారం.



మెగా డీఎస్సీ ప్రక్రియలో భారీ అవకతవకలు



- **డీఎస్సీ కుంభకోణానికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుకు తీసుకొస్తా**
- **స్పోర్ట్స్ కోటా నిబంధనలను ఎందుకు మార్చారని ప్రశ్న**
- **జూడో ఆట కింద 39 మందికి ఉద్యోగాలు ఇచ్చారని విమర్శ**

అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన మెగా డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని వైసీపీ అధినేత జగన్ మరోసారి ఆరోపించారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసత్యాలు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఈ భారీ కుంభకోణానికి సంబంధించిన అన్ని ఆధారాలను త్వరలోనే సమగ్రంగా ప్రజల ముందుకు తీసుకొస్తానని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల తయారీ, పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఒకే ఒక్క వ్యక్తికి/సంస్థకు ఎలా అప్పగిస్తారని- మిగతా 3లో




ఏపీలోని 8 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్..

- **ఏపీలోని 8 జిల్లాలకు రాగల 3 గంటలకు ఆరెంజ్ అలెర్ట్**
- **విశాఖ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ప్రభావం**
- **పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం**
- **గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు**
- **చెట్ల కింద, హోర్డింగుల వద్ద ఉండవద్దని ప్రజలకు సూచన**

ప్రజల అంచనాలకు తగ్గట్టు

కలెక్టర్లు మారాలి

- **టెక్నాలజీ, ఏఐ వాడకం తప్పనిసరి: సీఎం చంద్రబాబు**
- **8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు**
- **కొత్త తరం నాయకత్వ పద్ధతులు అలవర్చుకోవాలని కలెక్టర్లకు సూచన**
- **పరిపాలనలో ఏఐ, టెక్నాలజీ వినియోగంతో కచ్చితమైన ఫలితాలు సాధించాలని నిర్దేశం**
- **అధికారులు, నేతలకు విశ్వసనీయతే అత్యంత ప్రధానం అన్న సీఎం**
- **ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలోచనా విధానం మార్చుకోవాలని పిలుపు**



అమరావతి

ప్రజల ఆశలు, అంచనాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని, కొత్త తరం నాయకత్వ పద్ధతులను (న్యూ ఏజ్ లీడర్‌షిప్) అలవర్చుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పరిపాలనలో టెక్నాలజీని అందిపుచ్చుకుని, వేగవంతమైన ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. గురువారం అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో "లీడర్‌షిప్ - న్యూ ఏజ్ గవర్నెన్స్" అనే అంశంపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "గతంలో అనేక అంశాలపై దృష్టి సారించినా, ఇప్పుడు ప్రధానంగా నాయకత్వంపైనే ఆలోచించాలని నిర్ణయించాం. సరైన నాయకత్వంతోనే వేగంగా ఫలితాలు సాధించి, స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యాలను చేరుకోగలం. - మిగతా 3లో

బీఆర్ఎస్ కుట్రలను బలంగా తిప్పికొట్టాలి

ఎమ్మెల్యేలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

ఆరు డీఏలు త్వరలో ప్రకటిస్తాం

ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. డీఏలపై సీఎం రేవంత్ కీలక హామీ

ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో జేఏసీ చర్చలు

పీఆర్‌సీ నివేదికను వెంటనే అందేలా చర్యలు

ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను తెలియజేసిన నేతలు

హైదరాబాద్

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం.. తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్' (టీఆర్ఈ ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి తెలిపారు. ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. - మిగతా 3లో

ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది

- **రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్న భట్టి**
- **ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల కోసం శ్రీశైలం, సాగర్ తదితర రిజర్వాయర్లను పరిశీలిస్తున్నామని వెల్లడి**
- **విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందన్న డిప్యూటీ సీఎం**

హైదరాబాద్

తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం - మిగతా 3లో

గురువారం 10 సెప్టెంబర్ 2026

సీమ వార్త సాయంకాలం


అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

రెవెన్యూ సేవలు... ప్రజలకు సౌకర్యంగా ఉండాలి..!!

భూ రీ సర్వే పురోగతి, మ్యుటేషన్ల వేగవంతం వాటిపై రెవెన్యూ సిబ్బందికి సూచనలు.

గోరంట్ల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన... జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్





రివ్యూలు కాదు... రిజల్ట్స్ కావాలి..!!

....ఆలోచనలతో పాటు... అమలూ ఉండాలి వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర

....కరవు ప్రాంతాలకు నీళ్లిస్తేనే నాకు సంతృప్తి...రియాక్టివ్ నుంచి ప్రో యాక్టివ్ దిశగా అధికారులు పనిచేయాలి

.....జిల్లాకు 25, నియోజకవర్గానికి 10-15 ప్రాధాన్యతాంశాలను గుర్తించాలి

....మభ్యపెట్టే విధంగా కాదు... వాస్తవ నివేదికలు కావాలి ....కలెక్టర్లు, అధికారులు, మంత్రుల మధ్య పోటీ ఉండాలి

....8వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

.....సాగునీటి రంగంలో విశేష కృషి చేసి వాటర్ మ్యాన్‌గా నిలిచిన సీఎం చంద్రబాబుకు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో స్టాండింగ్ ఓవేషన్



పుట్టపర్తి డెస్క్ (అమరావతి,)సెప్టెంబర్ 10 సీమ వార్త సాయంత్రం

శాఖలు, అంశాలపై గంటల తరబడి రివ్యూలు చేయడం కాదు... రిజల్ట్స్ కావాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లను.. అధికారులను నిర్దేశించారు. రాష్ట్ర సచివాలయంలో 8వ జిల్లా కలెక్టర్ల సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రారంభమైంది. గురువారం తొలిరోజు సమావేశంలో జిల్లా కలెక్టర్లకు... అధికారులకు వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజా సేవకులుగా ఉందాం... ఈగోలు వద్దు అంటూ కలెక్టర్లకు సూచించారు. గత సమావేశంలో నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులు ఇక నుంచి తప్పనిసరి కావాలన్నారు. ఓనర్‌షిప్ తీసుకోగలిగితేనే... లీడర్‌షిప్ ఇవ్వగలరంటూ అంటూ మంత్రులకు, అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి - మిగతా3లో








సత్యసాయి నీటికి రూ.1 కోటి... అడగానే ఆదుకున్న బాబు..!!

తక్షణం పెండింగ్ నిధులు మంజూరు చేయాలని లేఖ తెలిపిన...పల్లె సింధూర రెడ్డి

....పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక చొరవతో....తక్షణం రూ. 1కోటి నిధులు మంజూరు


చంద్రబాబుకు ,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు,మంత్రి నారా లోకేష్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే సింధూర రెడ్డి

పుట్టపర్తి సెప్టెంబర్ 10 సీమ వార్త సాయంత్రం.



పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక చొరవతో సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టుకు రూ.1 కోటి నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. నియోజకవర్గంలోని ప్రజలకు సురక్షితమైన, నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టు ఎంతో కీలకమని ఎమ్మెల్యే సింధూర రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ,మంత్రి నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకెళ్లగా,వారు వెంటనే స్పందించి తక్షణం ఈ ప్రాజెక్టుకు రూ.1 కోటి నిధులను మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కూటమి ప్రభుత్వానికి , సీఎం,డిప్యూటీ సీఎం,నారా లోకేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎంఎల్ఏ పల్లె సింధూర అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే సింధూర రెడ్డి తెలిపారు.సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయడంపై నియోజకవర్గ ప్రజలు, సత్యసాయి త్రాగునీటి ప్రాజెక్టు కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే సింధూర రెడ్డికి మరియు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ,ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సతాయిస్తున్న సర్వర్..!!





పెన్షన్లకు మోకా లడ్డుతున్న సర్వర్....

లబ్ధిదారుల కడుపు కొడుతున్న ప్రభుత్వ నిబంధనలు

తక్కువ గడువు, తప్పని క్యాస్ట్, ఇన్కమ్ సర్టిఫికెట్లు..

వరుస సెలవులతో పేదలకు మరింత కష్టం

తాడిపత్రి, సెప్టెంబర్ 10 సాయంత్రం: పేదలకు కొత్త పెన్షన్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది.. దరఖాస్తుకు మాత్రం కేవలం 10 రోజులే గడువు ఇచ్చింది. సెప్టెంబర్ 7 నుంచి 16 వరకే లాస్ట్ డేట్ అని చెప్పడంతో రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల మందికి పైగా అర్హులైన పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందులోనూ పెన్షన్ కు అప్లై చేయాలంటే క్యాస్ట్, ఇన్కమ్ సర్టిఫికెట్లు తప్పనిసరి చేయడం, సర్టిఫికెట్లకు అప్లై చేస్తే రోజంతా సర్వర్ బిజీ, లింక్ లేదంటూ సచివాలయాల్లో తిప్పడం పేదలను మరింత కంగారు పెడుతోంది.రోజు కూలీ పనికి పోతేగాని పూట గడవని నిరుపేదలు పనులు మానుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు సచివాలయాల ముందు క్యూ లైన్లలో నిలబడుతున్నారు. వృద్ధులు, వితంతువులు గంటల తరబడి నిలబడలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వరుసగా మూడు రోజులు సెలవులు..

గడువు మరింత తక్కువ

ఈ వారాంతంలో ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా మూడు రోజులు సెలవులు రానున్నాయి. సెప్టెంబర్ 12న రెండో శనివారం, 13న ఆదివారం, 14న వినాయక చవితి పండుగ సందర్భంగా సెలవులు ఉన్నాయి. దీంతో 10 రోజుల గడువులో 3 రోజులు పోతే.. పేదలకు మిగిలేది కేవలం 7 రోజులే. ఈ 7 రోజుల్లోనే అన్ని సర్టిఫికెట్లు ఎలా తెచ్చుకోవాలని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

3 నెలల క్రితం ఇచ్చిన ఇన్కమ్ సర్టిఫికెట్ చెల్లదంటున్న వైనం

అంతేకాదు 3 నెలల క్రితం తీసుకున్న ఇన్కమ్ సర్టిఫికెట్లు చెల్లవని, ఫ్రెష్ గా తీసుకురావాలని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. దీంతో మళ్లీ మొదటికి వచ్చినట్లు అయిందని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెన్షన్ దరఖాస్తు గడువును కనీసం సెప్టెంబర్ 30 వరకు పెంచాలని, సర్వర్ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని పేద ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సీమ వార్త సాయంకాలం
గురువారం 10
సెప్టెంబర్ 2026

రివ్యూలు కాదు... రిజల్ట్స్ కావాలి..!!

-మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ..."27 నెలల్లో అనేక వ్యవస్థాగత మార్పులు చేశాం. ఆ ఫలితాలు కనిపిస్తున్నాయి. 28 కొత్త పాలసీలతో అవకాశాలను అన్ లాక్ చేశాం. రియాక్టివ్ గవర్నెన్స్ నుంచి ప్రో యాక్టీవ్ గవర్నెన్స్‌కు వెళ్లాలి. ఫైల్ పెండింగ్ అంటే అభివృద్ధి పెండింగే. ఫిర్యాదు పెండింగ్ అంటే ప్రజలకు న్యాయం పెండింగ్. విజన్ ఉన్నా.. దాన్ని అమలు చేయకుంటే... అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి. ఇప్పుడు కాలం మారింది... పనిచేస్తేనే సరిపోదు.. ఫేక్ ప్రచారాలకు కౌంటర్ కూడా ఇవ్వాలి. ఫేక్ ప్రచారం చేస్తుంటే లీడ్ తీసుకుని రియాక్ట్ అవ్వాలి. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు...వాస్తవాలు చెప్పాలి. రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ మొత్తంగా 12 గంటలు జరుగుతుంది... ఇది చాలా కీలకం. సమస్యను దాచిపెడితే పెద్దది అవుతుంది... ఓపెన్‌గా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు... ప్రజలు మెచ్చే సుపరిపాలన కావాలి. శాఖలు పోటీ పడాలి. జిల్లాలు పోటీ పడాలి. సెక్రటరీలు పోటీ పడాలి, కలెక్టర్లు పోటీ పడాలి. బెస్ట్ ప్రాక్టీసెస్ షేర్ చేసుకుందాం...బెస్ట్ పాలసీలు అమలు చేద్దాం. వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర."అని ముఖ్యమంత్రి అన్నారు.

టీమ్ సక్సెస్‌తోనే అభివృద్ధి

"ఈసారి లీడర్షిప్ అంశంపై కలెక్టర్ల సదస్సులో ప్రత్యేకంగా చర్చించాలి. కొన్ని చోట్ల లీడర్షిప్ లోపం ఉంది. ఉద్యోగుల సామర్థ్యం పెంపు కోసం వివిధ కోర్సులు కూడా నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకూ 1.50 కోట్ల కోర్సులను సామర్థ్యాలను పెంచేందుకు నిర్వహించాం. అవకాశాలను అన్ లాక్ చేయండి... అభివృద్ధి సాధించండి "మనకు ఉన్న అవకాశాలను అన్‌లాక్ చేయగలిగాం. ప్రతి శాఖలోనూ సంస్కరణలు తీసుకువచ్చాం. ప్రతి జిల్లాలోనూ 25 టాప్ ప్రాజెక్టులను గుర్తించాలి... నియోజకవర్గానికి 10-15 ప్రాజెక్టులను ప్రాధాన్యతగా గుర్తించి అభివృద్ధి చేయాలి. జిల్లాల్లో గ్రోత్ ఇంజన్లను గుర్తించి దానికి అనుగుణంగా సంపద, ఆదాయాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలి. కోనసీమ కొబ్బరికి, వరికి ఫేమస్ కానీ ఇప్పుడు ఆదాయంలో వెనుకపడింది. నూతన ఆదాయ మార్గాల్ని అన్వేషించాలి. కొత్త అవకాశాలను అందిపుచ్చుకుని ఏలూరు జిల్లా ఇప్పుడు అత్యుత్తమ జిల్లాగా మారింది.

నెలవారీ నివేదికలతో అభివృద్ధి ప్రయాణం

"ప్రతి నెలా ఆర్థిక నివేదికను విడుదల చేసి ఎప్పటికప్పుడు లక్ష్యాలను బేరీజు వేసుకుంటున్నాం. ప్రతి మూడు నెలలకూ జీఎస్డీపీని కూడా లెక్కించి ప్రగతిలో ఎక్కడ ఉన్నామో చూస్తున్నాం. 2022-23 బేస్ ఇయర్ గా ప్రస్తుత ధరలకు అనుగుణంగా 13.44 శాతం వృద్ధి రేటు నమోదైంది. తయారీ రంగంలోనూ అభివృద్ధి నమోదు అయ్యింది. జీఎస్టీ వసూళ్లు కూడా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.25,450 కోట్ల మేర పెరిగాయి. రెవెన్యూ శాఖలో సంస్కరణల్ని అమలు చేస్తున్నాం. 120 ఏళ్ల నాటి భూ సమస్యల్ని కూడా పరిష్కరిస్తున్నాం. 1908 నుంచి అమలాపురంలో గ్రౌండ్ రెంట్ భూముల విషయంలో నిర్ణయం తీసుకుని 1,416 మందికి పట్టాలు ఇచ్చాం. 2027 నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేసే బాధ్యత మనందరిది. పాలన అంటే గుడ్డిగా పనిచేయటం కాదు. వినూత్న ఆలోచనలు చేయాలన్నారు.

ఇద్దరు మహిళా అధికారులకు సీఎం ప్రశంసలు

"కొందరు వ్యక్తులు ఫేక్ ప్రచారంతో సమస్యలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. వేగంగా స్పందిస్తే దానికి కౌంటర్ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. సరైన సమయంలో స్పందించకపోతే ఆ శిక్ష ప్రభుత్వానికి పడుతుంది. కొందరు రాజకీయాలు చేస్తూ తప్పు దోవ పట్టించే ప్రయత్నం జరుగుతోంది. డీఎస్సీ-2025లో ఎక్కడా తప్పు జరగలేదు. స్పోర్ట్స్ కోటాలో నిబంధనల ప్రకారమే ఉద్యోగాలిచ్చాం. కానీ కొందరు అదే పనిగా ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. దీనిపై ఇద్దరు మహిళా అధికారులు చక్కగా స్పందించి కౌంటర్ ఇచ్చారు...

సీఈఓ టు వాటర్ మ్యాన్

ఎకనమిక్ టైమ్స్ లో వచ్చిన వాటర్ మ్యాన్ ఆర్టికల్ గురించి కలెక్టర్ల కాన్ఫరెన్సులో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. సాగునీటి రంగంలో సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని అభినందిస్తూ కలెక్టర్ల కాన్ఫరెన్సులో స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ..."నీటి వనరుల రంగంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సాధించిన విజయాలను దేశం గుర్తించింది. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువల ద్వారా నీటి విడుదల గురించి వివిధ రాష్ట్రాల్లో చర్చ జరుగుతోంది. ఈ నిశ్శబ్ద పురోగతి వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారు. మొదటి కలెక్టర్ల కాన్ఫరెన్సులోనే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నీళ్లు ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. అందుకే హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లు ఇవ్వగలిగాం. ఉమ్మడి రాష్ట్రంలో ఇజ్రాయెల్ నుంచి డ్రిప్ టెక్నాలజీని తీసుకువచ్చి రాష్ట్రంలో అమలు చేశాం. గతంలో రూ.16 మీటరు డ్రిప్ పైప్ ఖరీదు. ఇప్పుడు 30 ఏళ్ల ద్రవ్యోల్బణం తర్వాత రూ.1.60 పైసలకే దొరుకుతోంది. రాయలసీమ జిల్లాల్లో డ్రిప్ ద్వారా చేసిన సాగు, సృష్టించిన సంపదే దీనికి ఉదాహరణ. పట్టిసీమ ప్రాజెక్టును కొందరు వ్యతిరేకించారు. కానీ ఆదే ప్రాజెక్టు నుంచి ఇప్పటి వరకూ 500 టీఎంసీల నీటిని తరలించగలిగాం అని అన్నారు కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలు... ప్రజలకు సౌకర్యంగా ఉండాలి..!!



గోరంట్ల,సెప్టెంబర్,10: సీమ వార్త సాయంత్రం. శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ గోరంట్ల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా కార్యాలయంలోని పలు విభాగాలను పరిశీలించి, అనంతరం రెవెన్యూ సిబ్బంది మరియు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మ్యుటేషన్ల వేగవంతం: ప్రజల నుండి వచ్చిన మ్యుటేషన్ అప్లికేషన్లను ఎట్టిపరిస్థితుల్లోనూ కాలయాపన చేయకుండా, నిర్దేశిత గడువు లోపు పారదర్శకంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వే పురోగతి: మండలంలో జరుగుతున్న సమగ్ర భూ సర్వే పురోగతిపై ఆరా తీశారు. సర్వే ప్రక్రియలో సరిహద్దు వివాదాలు లేకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పక్కా ఆధారాలతో రికార్డులను సిద్ధం చేయాలని విఆర్ఓలు మరియు సర్వేయర్లకు సూచించారు. రెవెన్యూ సేవల పారదర్శకత: తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే అర్జీదారుల (ప్రజల) సమస్యలను సానుభూతితో విని, పరిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యాలయ రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని హెచ్చరించారు.

సిబ్బంది హాజరు - పనితీరు:
మండల కార్యాలయ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గోరంట్ల తహశీల్దార్ మధు నాయక్, డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐలు, విఆర్ఓలు, మండల సర్వేయర్లు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏకలవ్య విగ్రహ నిర్మాణం కొరకు....

రూ, 2 లక్షల విరాళం

టిడిపి నేత నిమ్మల శ్రీధర్ దంపతుల ఔదార్యం.



గోరంట్ల సెప్టెంబర్ 10 సీమ వార్త సాయంత్రం. గోరంట్ల పట్టణంలో ఎస్సీ హాస్టల్ దగ్గర మెయిన్ రోడ్డు నందు ఆలిండియా ఎరుకల ఏకలవ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విగ్రహ నిర్మాణం జరుగుచున్నది ఈ విషయంపై వెనుకబడిన వర్గాల జాతి సహాయం చేయాలని మంచి మనసుతో బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు సవితమ్మ ఆదేశాల మేరకు టిడిపి నేత నిమ్మల శ్రీధర్ దంపతులు విగ్రహ నిర్మాణం కొరకు ఆర్థికంగా 2 లక్ష రూపాయలు విరాళము అందజేశారు సంఘ సభ్యులు ఆ దంపతులను పూలమాల శాలవాలతో ఘనంగా సత్కరించి సన్మానించారు కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవరకొండ ఉమా శంకర్ జిల్లా అధ్యక్షుడు పి వెంకటాచలపతి జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర్ టౌన్ ప్రెసిడెంట్ సా కే నరసింహప్ప టౌన్ ఉపాధ్యక్షులు కుళ్ళాయప్ప మండల ఉపాధ్యక్షులు గేజ్జల రమణప్ప మరియు పెద్ద గంగప్ప తదితరులు పాల్గొన్నారు

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేసిన యూనిట్ ఇంచార్జ్



మడకశిర సెప్టెంబర్ 10 సీమ వార్త సాయంత్రం. నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండల కేంద్రంలో ఏర్పడిన తాగునీటి సమస్యను పరిష్కరించడానికి టిడిపి యూనిట్ ఇంచార్జ్ జగన్నాథ్ పూజ చేశారు. నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండల కేంద్రంలో పంచాయతీలో గత పది రోజుల నుండి త్రాగునీటి సమస్య ఉన్నందున ఒక ప్రైవేటు సంస్థకు చెందిన టెలికాం డిపార్ట్మెంట్ కేబుల్ వైర్ల కోసం రంధ్రాలు వేసిన సమయంలో మెయిన్ వాటర్ పైప్లైన్ పగిలిపోయింది. గత పది రోజులుగా చాలా తాగునీటి కోసం కోసం ఇబ్బంది పడ్డ ప్రజలకు ప్రజలకు పంచాయతీ అధికారులతో మాట్లాడి వారి సిబ్బంది సహాయంతో పైప్లైన్ రిపేర్ చేసి పైప్లైన్ ద్వారా మంచినీటి సరఫరా చేయడం జరిగింది అని యూనిట్ ఇంచార్ జగన్నాథ్ తెలిపారు.

పోషకాహారంపై అంగన్వాడీల్లో అవగాహన

చిరుధాన్యాల ప్రాధాన్యతపై చైతన్యం

మన అంగన్వాడీ - మన బాధ్యత నినాదంతో ఘనంగా పోషణ్ మాసం



తాడిపత్రి, సెప్టెంబర్ 10 సాయంత్రం : అంబేద్కర్ నగర్ సెక్టార్ కార్యాలయానికి చెందిన అంగన్వాడీ సెంటర్ నందు సూపర్వైజర్ కే . రామలక్ష్మి ఆధ్వర్యంలో పోషణ్ మాసం – 2026 లో భాగంగా పౌష్టిక ఆహార మానోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలకు చిరుధాన్యాల ప్రాముఖ్యత, విటమిన్స్, మినరల్స్, ప్రోటీన్స్ కలిగిన ఆహార పదార్థాల గూర్చి వివరించారు. ఆయా ఆహార పదార్థాలలో ఉండే పోషక విలువల గురించి తల్లులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సంప్రదాయ చిరుధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాలని, పిల్లలకు పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని సూపర్వైజర్ కే . రామలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జి . శ్వేతా , కే . రాజేశ్వరమ్మా , బి . ఆది లక్ష్మి తో పాటు పలువురు తల్లులు పాల్గొన్నారు.

విద్య ఉంది.. ఉద్యోగం ఎక్కడ?

....చదువు--నైపుణ్యం--ఉపాధి మధ్య పెరుగుతున్న అంతరం.

.....యువత భవిష్యత్తుపై ఆందోళన

(లింగప్రసాద్- సీనియర్ జర్నలిస్ట్, కళ్యాణదుర్గం)

దేశం వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచంలోకి అడుగులు వేస్తున్నప్పటికీ, విద్యను ఉపాధితో అనుసంధానించడంలో ఉన్న సవాళ్లు యువత భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకవైపు ఉన్నత విద్యకు ప్రాధాన్యం పెరుగుతుండగా.. మరోవైపు చదువు పూర్తయిన తర్వాత తగిన ఉద్యోగం లభించకపోవడం, నైపుణ్యాలకు సరిపడే అవకాశాలు లేకపోవడం సమస్యగా మారుతోంది. దీంతో విద్యకు ఖర్చు పెరుగుతున్నా.. విద్యకు తగ్గ ఉపాధి అవకాశాలు ఎంతవరకు అందుతున్నాయన్న ప్రశ్న ముందుకు వస్తోంది. తాజా కేంద్ర ప్రభుత్వ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే -2025 ప్రకారం 15--29 ఏళ్ల యువతలో నిరుద్యోగిత రేటు 9.9 శాతంగా ఉంది. గ్రామీణ యువతలో 8.3 శాతం ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 13.6 శాతంగా నమోదైంది. యువతలో ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కోసం పోటీ తీవ్రంగా ఉన్న పరిస్థితిని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి.

చదువు పెరిగినా.. ఉద్యోగం సవాలే

అధికారిక గణాంకాల ప్రకారం 2025లో మాధ్యమిక విద్య లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగిన 15 ఏళ్లు పైబడిన వారిలో నిరుద్యోగిత 6.5 శాతంగా ఉంది. 2024లో నమోదైన 7 శాతంతో పోలిస్తే ఇది తగ్గినప్పటికీ, విద్యావంతుల ఉపాధి సమస్య పూర్తిగా పరిష్కారమైనట్లు భావించలేమని నిపుణుల విశ్లేషణలు సూచిస్తున్నాయి. అంతర్జాతీయ కార్మిక సంస్థ కూడా భారతదేశంలో యువతలో విద్యా స్థాయి పెరుగుతున్నప్పటికీ, వారి విద్యా అర్హతలకు సరిపోయే ఉపాధి అవకాశాల సృష్టి అంత వేగంగా జరగడం లేదని తన ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ 2024లో పేర్కొంది. నైపుణ్యాలు, ఉద్యోగానికి అవసరమైన సామర్థ్యాల మధ్య అంతరం కూడా సమస్యగా ఉందని నివేదిక విశ్లేషించింది.

ప్రభుత్వ, ప్రైవేటు విద్య మధ్య అంతరం:-

దేశంలో విద్యా ప్రాప్తి విస్తరించినప్పటికీ, విద్యా నాణ్యతలో



సమానత్వం ఇంకా ప్రధాన సవాలుగానే ఉంది. ఆసర్ 2024 ప్రకారం గ్రామీణ భారతదేశంలో పాఠశాలల్లో చేరిక రేట్లు 6--14 ఏళ్ల వయసులో 98.1 శాతంగా ఉన్నాయి. అయితే చదవడం, గణితం వంటి ప్రాథమిక సామర్థ్యాల్లో విద్యార్థుల మధ్య ఇంకా తేడాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసన స్థాయిలు మెరుగుపడుతున్నప్పటికీ, ప్రైవేటు పాఠశాలలతో వ్యత్యాసం పూర్తిగా తొలగిపోలేదని నివేదిక వెల్లడించింది. అందువల్ల పిల్లలను పాఠశాలలో చేర్పించడం మాత్రమే కాదు.. వారు ఏం నేర్చుకుంటున్నారు, ఆ విద్య భవిష్యత్తులో వారికి ఏ నైపుణ్యాలను అందిస్తోంది అన్నదే కీలకం.

డిగ్రీ నుంచి ఉద్యోగం వరకు.. మారాల్సిన దారి:-

సాంప్రదాయ విద్యా విధానంలో డిగ్రీ, పీజీ, పరిశోధన వంటి విద్యార్హతలు సాధించడం మాత్రమే విజయానికి మార్గంగా భావించే పరిస్థితి నుంచి బయటపడాల్సిన అవసరం ఉంది. ఆధునిక పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు, డిజిటల్ సామర్థ్యాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలు, వృత్తి విద్య వంటి అంశాలను విద్యలో మరింత బలంగా అనుసంధానించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో ప్రతి విద్యార్థి ప్రభుత్వ ఉద్యోగాన్నే లక్ష్యంగా పెట్టుకునే పరిస్థితి కూడా మారాలి. ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామిక రంగం, చిన్నతరహా పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత వ్యాపారాలు, సేవా రంగం, స్టార్టప్‌లు, స్థానిక ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహం పెరగాలి.



యువతలో నిరాశ పెరగకుండా చర్యలు అవసరం

చదువు పూర్తయినా ఉపాధి దొరకకపోవడం యువతలో నిరాశకు కారణమయ్యే అవకాశం ఉంది. ఉపాధి అవకాశాలు లేకపోవడం కేవలం వ్యక్తిగత ఆర్థిక సమస్య మాత్రమే కాదు.. కుటుంబ ఆర్థిక పరిస్థితి, సామాజిక స్థిరత్వం, యువత భవిష్యత్తు వంటి అంశాలపైనా ప్రభావం చూపే సమస్య. అందుకే విద్యా వ్యవస్థను ఉపాధి మార్కెట్‌తో అనుసంధానం చేయడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇవ్వడం, గ్రామీణ యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడం, స్వయం ఉపాధికి ఆర్థిక మరియు సాంకేతిక సహకారం అందించడం అత్యవసరం.

మానవ వనరులే దేశానికి అసలైన సంపద:-

భారతదేశానికి విస్తారమైన యువ జనాభా ఒక గొప్ప అవకాశమైతే, వారికి నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, గౌరవప్రదమైన ఉపాధి కల్పించడం పెద్ద బాధ్యత. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో విద్యా విధానం కూడా అదే వేగంతో మారాల్సిన అవసరం ఉంది. విద్య కేవలం సర్టిఫికెట్ కోసం కాకుండా.. జీవితానికి ఉపయోగపడే జ్ఞానం, నైపుణ్యం, ఉపాధి కల్పించే సాధనంగా మారాలి. యువతకు అవకాశాలు కల్పిస్తేనే జనాభా శక్తి ఆర్థిక శక్తిగా మారుతుంది. లేకపోతే అదే జనాభా ఒత్తిడిగా మారే ప్రమాదం ఉంటుంది. అందుకే దేశం ముందుకు సాగాలంటే విద్యా నాణ్యత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి సృష్టి, పారిశ్రామికాభివృద్ధి అనే నాలుగు అంశాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలి. యువతకు చదువు మాత్రమే కాదు.. చదువుకు తగ్గ భవిష్యత్తు కూడా కావాలి.

టిడిపి కార్యకర్త పార్టీ పార్థివ దేహానికి...

తెలుగు తమ్ముళ్ల నివాళులు.

మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి.



గోరంట్ల సెప్టెంబర్ 10 సీమ వార్త సాయంత్రం. మండలంలోని వడిగేపల్లి పంచాయతీ గొల్లపల్లి కి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటేష్ కుమారుడు బెంగుళూరు లో ఆక్సిడెంట్ లో మరణించడం జరిగింది. గొల్లపల్లి లో పార్థివాదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన గుత్తా బాలకృష్ణ చౌదరి టీడీపీ మండల కన్వీనర్ మరియు లిజిల్లా కార్యదర్శి నరేష్ కుమార్, పాలసముద్రం సింగల్ విండో అధ్యక్షులు బెల్లలచెరువుచంద్ర, మాజీ జడ్పీటీసీ సుబ్బారెడ్డి, మహమ్మద్, మాజీ సర్పంచ్ నరసింహామూర్తి, స్టోర్ డీలర్ చంద్రప్ప,హరిష్ రెడ్డి,పంచాయతీ అధ్యక్షులు ఆదినారాయణ, రవి.పాల్గొన్నారు.

ఎన్నికల హామీను విస్మరించిన కూటమి ప్రభుత్వం

50 ఏళ్లు నిండిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు సామాజిక పింఛన్ వెంటనే ఇవ్వాలి

వైయస్సార్ సిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి డిమాండ్

మడకశిర సెప్టెంబర్ 10 సీమ వార్త సాయంకాలం




కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి సూపర్ సిక్స్ అంటూ 50 సంవత్సరాలు నిండిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు సామాజిక పింఛన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చి ఈ రోజు ఆ వర్గాలను విస్మరించింది. కేవలం అధికారంలోకి రావడం కోసం మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీతో ఓట్లు దండుకొని ఈ రోజు అధికారంలోకొచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తి అవుతున్న ఎందుకు వారికి పించెను ఇవ్వలేకపోతున్నారో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమాధానం చెప్పాలి. కేవలం స్థానిక ఎన్నికల కోసం కూటమి ప్రభుత్వం హడావుడిగా పింఛన్లకు దరఖాస్తుకు అవకాశం ఇస్తూ అంక్షలు విధించడం చాలా బాధాకర విషయం. డప్పు కళాకారులు చర్మకారులు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుంచి సర్టిఫికెట్ తీసుకురండి అని చెప్పడంతో డప్పు కళాకారులు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. వెంటనే వారికి స్వీయ ధృవీకరణ పత్రంతో (సెల్ఫ్ డిక్లరేషన్) పింఛన్ మంజూరు చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏవైతే పింఛన్లు తొలగించినారు వాటిని యథాప్రకారం కొనసాగించాలని కోరుచున్నాం ప్రభుత్వం అలా చేయని పక్షంలో 50 ఏళ్లు నిండిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు మరియు డప్పు కళాకారులు చర్మకారులు తరపున సామాజిక పింఛన్ వచ్చేంతవరకు అర్హత కలిగిన వారికి మద్దతుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని తెలియజేస్తున్నాం అని జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.

సీమ వార్త సాయంకాలం
గురువారం 10
సెప్టెంబర్ 2026

వెలుగు చూసిన.... చారిత్రాత్మక సత్యం

'రామలింగేశ్వర ఆలయ నిర్మాణ మూలాలను వెల్లడించిన వీరనరసింహరాయల శాసనం'

చరిత్రకారుడు మైనాస్వామి





గోరంట్ల (తాడిపత్రి) సెప్టెంబరు10: సీమ వార్త సాయంత్రం. అనంతపురం జిల్లా తాడిపత్రి శ్రీబుగ్గ రామలింగేశ్వర (రామేశ్వర) ఆలయ నిర్మాణ చరిత్రలోనే అత్యంత కీలకమైన, ఇప్పటివరకు వెలుగుచూడని ఒక చారిత్రక సత్యాన్ని చరిత్ర కారుడు, పరిశోధకుడు మైనాస్వామి వెల్లడించారు. విజయ నగర సామ్రాజ్య పరిపాలన కాలం నాటి వీరనరసింహరాయల అరుదైన ధర్మ శాసనాన్ని సమగ్రంగా విశ్లేషించడం ద్వారా ఈ ఆలయ ప్రాకారాలు, గోపురాలు, మరియు భోగమండప నిర్మాణ మూలాలు వీరనరసింహరాయల శాసనశే ద్వారా స్పష్టంగా వెల్లడయ్యాయని బుధవారం(సెప్టెంబరు9) తాడిపత్రిలో ప్రకటించారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జె.సి.ప్రభాకర రెడ్డితో కలసి ఆలయాన్ని ఆయన సందర్శించారు. శాసనానికి సంబంధించి మైనాస్వామి వెల్లడించిన సవరించిన పూర్తి వివరాలు ఈ విధంగా వున్నాయి. శాసనం సంస్కృతం మరియు తెలుగు భాష ప్రభావాలతో కూడి ఉన్నప్పటికీ, పూర్తిగా తెలుగు లిపిలోనే రాయబడింది. ఇది ప్రసిద్ధ శివ స్తుతి శ్లోకాలతో ప్రారంభమవుతుంది. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా వారి 'సౌత్ ఇండియన్ ఇన్ స్క్రిప్షన్స్' (సంపుటి 4)లో 1923లోనే ఈ శాసనం నమోదయినప్పటికీ,నేటివరకు దీనిలోని కాలం (తేదీ) గానీ, గుడి నిర్మాణకర్తల వివరాలు గానీ బయటి ప్రపంచానికి వెల్లడికాలేదు. విజయనగర ఆలయ వాస్తు-శిల్పకళపై సాగించిన ప్రత్యేక పరిశోధనలో భాగంగా శాసనపాఠాన్ని సమగ్రంగా విశ్లేషించి,ఆలయ నిర్మాణప్రదాతల వివరాలను ప్రామాణిక ఆధారాలతో సహా మైనాస్వామి వెలుగులోకి తెచ్చారు. గర్భగుడి వెనుక వున్న 3 రాతిపలకలపై గల రాతలు,పడమర-దక్షిణ గోపురాల్లో మరియు,గుడి ప్రవేశ ద్వారాల వద్ద వున్న శాసనాలు బుగ్గ రామలింగేశ్వర సన్నిధి చరిత్రను తెలుపుతుండగా వాటిలో తొలి శాసనం తుళువ వీరనరసింహ రాయలదని మైనాస్వామి స్పష్టం చేశారు. అంటే 1509 మే4 నాటికి ఉత్తర గోపురం మినహా దేవాలయ నిర్మాణం పూర్తయిందని చరిత్రకారుడు విశ్లేషించారు. విజయనగర సామ్రాజ్యాధిపతి వీరనరసింహరాయల (శ్రీకృష్ణదేవరాయల సోదరుడు) పాలనలో,శాలివాహన శకవర్షం 1431 వైశాఖ శుద్ధపౌర్ణమి పుణ్యకాలాన (సా.శ. 1509 మే 4 శుక్రవారం) ఈ ధర్మశాసనం వేయబడింది. సాధారణంగా లభించే శాసనాలు కేవలం పూజలకు లేదా గ్రామాన్ని దానమిచ్చిన వివరాలకే పరిమితమవుతాయి. కానీ ఈ శాసనంలో.. "...ఆ దేవునికి మేము భోగమండపమును కట్టించి గోపుర ప్రాకారాది నిర్మాణమును శేయింపుచుంను..." (లైన్లు 23-24) అని స్పష్టంగా ఉంది. విజయనగర సామ్రాజ్య మహామంత్రి సాళువ తిమ్మరుసు (సాళువ తిమ్మయ్యంగారు) స్వయంగా తాడిపత్రిలోని అద్భుతమైన భోగమండపం (కళ్యాణ మండపం), విశాలమైన ప్రాకారాలు, మరియు శిల్పకళా శోభితమైన రాజగోపురాల నిర్మాణాన్ని ప్రారంభించారని చెప్పడానికి ఈ శాసనం ఏకైక ప్రత్యక్ష చారిత్రక సాక్ష్యమని మైనాస్వామి పేర్కొన్నారు. అలాగే, విజయనగర చక్రవర్తి వీరనరసింహరాయలకు పుణ్యంగా, గుత్తి రాజ్యం పెన్నబడి స్థలంలోని 'నెలదలపాడు' గ్రామానికి 'వీరనరసింహపురం' అని నామకరణం చేసి, ఆ గ్రామాన్ని సహిరణ్యోదక ధారాపూర్వకంగా తాడిపత్రి రామేశ్వర దేవునికి సాళువ తిమ్మరుసు సమర్పించారు. గ్రామం నుండి వచ్చే ఆదాయాన్నిఆలయ నిత్య పూజలు, అంగరంగ వైభవాలకు ఆచంద్రార్కశీ కేటాయించారు. ఇది విజయనగర యుగంలోని 'రాజ్యం - స్థలం - గ్రామం' అనే పరిపాలన వర్గీకరణకు నిదర్శనంగా నిలుస్తుంది. ఈ శాసనం వేయబడిన కొద్ది రోజులకే వీరనరసింహరాయలు దివంగతులు కావడం, అనంతరం శ్రీకృష్ణదేవరాయలు విజయనగర సింహాసనాన్ని అధిష్ఠించడం జరిగిందని, ఈ క్రమంలో తుళువ వంశపాలన ప్రారంభశే మరియు విజయనగర నిర్మాణ చరిత్ర పరిశోధనలోనూ ఈ నూతన ఆవిష్కరణ అత్యంత కీలకమైన మైలురాయిగా నిలుస్తుందని చరిత్రకారుడు మైనాస్వామి వివరించారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం



సోమందేపల్లి సెప్టెంబర్ 10 సీమ వార్త సాయంకాలం మండల పరిధిలోని మాగే చెరువు, చల్లాపల్లి తదితర ప్రాంతాల లోని కంది పంటలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా కార్యదర్శి హరి ఆధ్వర్యంలోని రైతు సంఘం నాయకులు గురువారం పంట పొలాలను పరిశీలించారు. ఆయా గ్రామాలలోని రైతులు అనేక సమస్యలను రైతు సంఘ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ జిల్లా కార్యదర్శి హరి మాట్లాడుతూ ప్రస్తుత ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు కారణంగా అనేక మంది రైతులు కంది పంటను విత్తుకోవడం జరిగిందని సుమారు ఎకరాకు దుక్కి చేయడానికి విత్తనం, కలుపు పెరగడం తదితర ఖర్చులతో కలిపి 20 వేల రూపాయల వరకు రైతులు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పూత పిందె దశలో ఉన్నా కూడా వర్షాలు రాక చెట్లు గిడ్డు బారిపోయాయని ఇప్పుడు వర్షాలు వచ్చినా కూడా కనీసం అరపంట కూడా రాదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అంతే కాకుండా మండలంలో వ్యవసాయం తర్వాత అనేక మంది రైతులు పశుసంపదపై ఆధారపడి జీవిస్తున్నారని వర్షాలు లేకపోవడంతో పశువులకు గడ్డి లేక 15,000 విలువచేసే ట్రాక్టర్ గడ్డిని 35 వేల రూపాయల వరకు ఖర్చుపెట్టి కొనవాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. చాల కూరు పంచాయతీలో సుమారు 300 మంది పాడి రైతులు ఉంటే కేవలం 25 ప్యాకెట్లు మాత్రమే ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ మీద భూస అందించిందని అదేవిధంగా మాగే చెరువులో 160 మంది రైతులు ఉంటే కేవలం 6 ప్యాకెట్లు మాత్రమే భూసా అందించారని రైతులకు భూసా అందించామని చెప్పుకోవడానికి మాత్రమే ప్రభుత్వం అందిస్తుందని అంతే కాని పాడి రైతులకు అవసరమైనంత బూస అందించడం లేదని ప్రస్తుతం ఎల్ఈనో ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వేరుశనగ రైతులు, కంది రైతులు, ప్రత్యామ్నాయ పంట రైతులు, పాడి రైతులు, గొర్రెలు మేకల పెంపకం దారులు, కరువు కోరల్లో చిక్కుకొని ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వం వెంటనే స్పందించి సత్యసాయి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించడంతోపాటు రైతులకు అవసరమైన గడ్డి, బూసా, దానాలను 100% సబ్సిడీతో అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు భాస్కర్, నందగోపాల్, సత్తి, రైతులు పాల్గొన్నారు.

సమన్వయంతో ... ఏలినో ను ఎదుర్కొన్నాం.

మామూలుగా సాగిన ఆఖరి మండల మీట్.

ఎంపీపీ ప్రమీల మూర్తి ఆధ్వర్యంలో సమావేశం.

ముఖ్యఅతిథిగా హాజరైన... రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్.



గోరంట్ల సెప్టెంబర్ 10 సీమ వార్త సాయంత్రం. ఎలినో ప్రభావం రాబోతుందని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో అధికారులు కూటమి పాలకులు సమన్వయంగా ఆ సమస్యను ఎదుర్కొని ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్ అధికారులను కోరారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం ఆఖరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ప్రమీల మూర్తి అధ్యక్షతన ఎంపీడీవో కమల భాయ్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన వివిధ శాఖల మండల స్థాయి అధికారులు గత మూడు నెలల ప్రగతి నివేదికలను వివరించారు. ప్రభుత్వం నుంచి మంజూరు అవుతున్న సంక్షేమ పథకాల పంపిణీలో అర్హులందరికీ న్యాయం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ నెంబర్ డాక్టర్ భాష, జడ్పిటిసి పాలే జయరాం నాయక్, సింగిల్ విండో అధ్యక్షులు బెల్లాల చెరువు చంద్ర, గోపాల్ రెడ్డి, రవి మోహన్, పాయల రమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెట్లు ఎండుతున్న.... కన్నీటి చూడరా.

.....మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డ..... పర్యావరణవేత్త భాస్కర్ నాయుడు





పుట్టపర్తి సెప్టెంబర్ 10 సీమ వార్త సాయంత్రం. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో అధికారులు నాటిన మొక్కలు నీరు లేక ఎండిపోతుండటంపై పర్యావరణవేత్త భాస్కర్ నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను ఆయన ప్రత్యక్షంగా నిలదీశారు.?ప్రధాన అంశాలు: నీరు లేక ఎండిపోతున్న మొక్కలు: ఎనుములపల్లి గణేష్ సర్కిల్ నుండి సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వరకు రోడ్డు డివైడర్ మధ్యలో మున్సిపల్ అధికారులు నాటిన చెట్లు నీరు పోయకపోవడంతో ఎండిపోతున్నాయి. కమిషనర్‌తో వాగ్వాదం: "లక్షల రూపాయల నిధులు వెచ్చించి చెట్లు నాటారు.. మరి నీళ్లు ఎందుకు పోయడం లేదు? పచ్చని చెట్లు ఎండిపోతుంటే మీకేమీ పట్టదా?" అని భాస్కర్ నాయుడు కమిషనర్‌ను నిలదీశారు. టెండర్ల సాకు: చెట్లకు నీరు పోసేందుకు టెండర్లు పిలుస్తున్నామని, అవి ఖరారయ్యాక నీరు పోస్తామని కమిషనర్ చెప్పడంపై ఆయన తీవ్ర అభ్యంతరం తెలిపారు. మధ్యలోనే వెళ్లిపోయిన కమిషనర్: "చెట్లు పూర్తిగా చనిపోయాక నీళ్లు పోస్తారా?" అని ప్రశ్నిస్తుండగానే కమిషనర్ సమాధానం చెప్పకుండా మధ్యలోనే వెళ్లిపోయారు. దీంతో భాస్కర్ నాయుడు ఆయనను నిలువరించి, అధికారుల బాధ్యతారాహిత్యంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. లక్షల?రూపాయలు వెచ్చించి నాటిన మొక్కలను కాపాడటంలో మున్సిపల్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, ఇప్పటికైనా వెంటనే స్పందించి ఎండిపోతున్న చెట్లకు నీటి సదుపాయం కల్పించాలని పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

నియోజకవర్గ వ్యాప్తంగా పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి



మడకశిర సెప్టెంబర్ 10 సీమ వార్త కరువుతో అల్లాడుతున్న నియోజకవర్గాన్ని పశుగ్రాసం ఏర్పాటు చేసి పశువులను కాపాడుకోవాలని వైకాపా నాయకులు కోరుతున్నారు. రాష్ట్రం లో సరైన వర్షాలు లేకపోవడంతో నియోజకవర్గ వ్యాప్తంగా భూములు బీడుగా మారాయి. పశువులకు మేత కొరత తీవ్రంగా ఏర్పడింది. పశువులకు సరైన మేత అందకపోవడంతో రైతులు వాటిని కబేళాలకు తరలించే పరిస్థితి ఏర్పడుతోందని వైఎస్ఆర్సిపి మడకశిర పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఎస్. బాబు ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వెంటనే పశుగ్రాస కేంద్రాలను ఏర్పాటు చేసి, పశువులకు ఉచితంగా గడ్డి మరియు అవసరమైన పశుగ్రాసాన్ని అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులు, పశుపోషకులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి పశుగ్రాసాన్ని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



మడకశిర సెప్టెంబర్ 10 సీమ వార్త సాయంకాలం మండల పరిధిలోని బుళ్ళ సముద్రం లో బుధవారం రాత్రి 12 గంటల సమయంలో ద్విచక్ర వాహనం లో వెళుతున్న నియోజకవర్గ పరిధిలోని గుడిబండ మండలం మందలపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టిది. ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

పోలింగ్ స్టేషన్లో జాబితా విడుదల



మడకశిర సెప్టెంబర్ 10 సీమ వార్త సాయంకాలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం వారి ఆదేశముల మేరకు మడకశిర నగర పంచాయితికి సంబంధించి గల మొత్తము 1 వ ఎన్నికల వార్డు నుండి 23 వార్డులకు సంబంధించి (డ్రాఫ్ట్) 23 పోలింగ్ స్టేషన్ల జాబిత గురువారం తేది:10.09.2026న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టరు, శ్రీ సత్య సాయి, రెవెన్యూ డివిజినల్ అధికారి, మడకశిర, . సివిల్ జూనియర్ జడ్జ్ కోర్డు, మడకశిర, మండల తహశీల్దారు, మడకశిర, సబ్ రిజిస్టరు, మడకశిర, కమీషనరు, మడకశిర నగర పంచాయితి అన్ని కార్యాలయముల యందు మునిసిపల్ పరిదిలోని వార్డు సచివాలయముల యందు ప్రజల పరిశీలనార్థం వుంచడమైనది. కావున సదరు 23 వార్డుల యందు గుర్తించిన ప్రతిపాదిత డ్రాఫ్ట్ 23 పోలింగ్ స్టేషన్ల జాబితాలను పరిశీలించుకొని ఏమైన అభ్యంతరములు/సలహాలు/సూచనలు వున్న యడల తేది:11.09.2026 లోపల కమీషనరు, మడకశిర నగర పంచాయితీ వారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా పట్టణ ప్రజలను కమిషనర్ మురళి తెలిపారు.

త్రాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వినతి



సోమందేపల్లి సెప్టెంబర్ 10 సీమ వార్త సాయంకాలం మండల కేంద్రంలోని పంచాయతీ పరిధిలో త్రాగునీటి సమస్య భవిష్యత్తులో తీవ్ర రూపం దాల్చకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటలక్ష్మి కు సిపిఎం , ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వచ్చే నష్టాలను హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో మేజర్ పంచాయతీ పరిధిలో త్రాగునీటి సమస్య ప్రజాభిప్రాయం మేరకు మేజర్ పంచాయతీ పరిధిలో సుమారు 23 నీటి బోర్లు ఉన్నాయని ఇందులో సుమారు 17 బోర్లు సక్రమంగా ఉన్నప్పటికీ మిగిలిన 6 బోర్లు హెచ్చూ తగ్గులుగా పనిచేస్తున్నాయన్నారు. బాలాజీ నగర్, వినాయక్ నగర్,షిరిడి నగర్, సప్తగిరి కాలనీ, ద్వారకామాయి నగర్, పాతవూరు, గాంధీ నగర్ లలో 10 నుండి 15 రోజుల కొకసారి నీటి సరఫరా చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రకృతి వైపరీత్యం వల్ల వర్షాభావ పరిస్థితులు తోడై ఎండల తీవ్రత పెరుగుతున్నందని రాబోవు కాలంలో భూగర్భ జలాలు తగ్గే అవకాశం ఉందని దీనివలన త్రాగునీటి తీవ్రత ఎద్దడి పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితులు రాకుండా త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మాబు కమిటీ సభ్యులు హనుమయ్య, కొండా వెంకటేశులు, నాగభూషణం, చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు పెద్దన్న , రెహమాన్ తదితరులు పాల్గొన్నారు

బ్లూమూన్ స్కూల్‌లో ఘనంగా విద్యార్థి నాయకుల ఎంపిక



కదిరి సెప్టెంబర్ 10 సీమ వార్త సాయంత్రం. స్థానిక గంగమ్మ మోరి ఎదురుగా ఉన్న బ్లూ మూన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో స్కూల్ హెడ్ బై హెడ్ గర్ల్,డిప్యూటీ హెడ్ బై హెడ్ గర్ల్,కల్చరల్ హెడ్ బై హెడ్ గర్ల్,స్పోర్ట్స్ కెప్టెన్,హౌస్ కెప్టెన్ లను ప్రజాస్వామ్య పద్ధతిలో బ్యాలెట్ ఉపయోగించి విద్యార్థుల చేత ఓటు వేపించి అత్యధిక ఓట్లు వచ్చిన విద్యార్థిని విద్యార్థులను వివిధ కేటగిరీల కెప్టెన్లగా ఎన్నుకోవడం జరిగిందని బ్లూ మూన్ విద్యా సంస్థల అధినేత శ్రీ ఎం. శివ శంకర్ గారు తెలియజేశారు, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకోవడం ద్వారా నాయకత్వ లక్షణాలు మెరుగవుతాయని విద్యాసంస్థల డైరెక్టర్ మౌనిక గారు తెలియజేశారు, ఎన్నికైన విద్యార్థినీ విద్యార్థులు తమ విధివిధానాలను సమర్థంగా నిర్వహించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి .సురేందర్ రెడ్డి తెలియజేశారు, నూతనంగా ఎన్నిక కాబడిన వివిధ కేటగిరీల కెప్టెన్లను పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమం లో ఇంచార్జ్ సి. మాధవరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు జి. రామాంజుల రెడ్డి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881